తిరుమల తిరుపతి దేవస్థానములు

# బాల సప్తగిరి

సచిత్రమాసపత్రిక

జూలై 2020

సప్తగిరి అనుబంధం







శ్రీవారి మెట్లోత్సవంలో బాలభజనబృందం

తిరుమల తిరుపతి దేవస్థానములు



# బాలసప్తగిరి

'సప్తగిరి' అనుబంధం

సంపుటి: 01 జూలై 2020 సంచిక: 05

## విషయసూచిక


| | | పుట |
|---|---|---|
| హిందూదేవుళ్లు | **చక్రత్తాళ్వార్**<br>– ఆచార్య కె. సర్వోత్తమరావు | 04 |
| పన్నిద్దరాళ్వార్లు | **నమ్మాళ్వారు**<br>– శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు | 06 |
| కన్నడహరిదాసవరేణ్యులు | **శ్రీ రాఘవేంద్రస్వామి**<br>– శ్రీ దేసువెంకటసుబ్బారావు | 08 |
| చిత్రకథ | **శ్రీవారికే మామగారు...**<br>కథ : శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు<br>చిత్రాలు: పేరూరు శివప్రసాద్ | 10 |
| బాలనీతి | **ఈర్ష్య మంచిది కాదు!!**<br>– ఆచార్య పి.ఎల్.శ్రీనివాసరెడ్డి | 14 |
| విశిష్టబాలుడు | | 16 |
| క్విజ్ | నిర్వహణ: డా॥ కంపల్లె రవిచంద్రన్ | 17 |
| చిత్రలేఖనం | | 18 |


ముఖచిత్రం : శ్రీవ్యాసమహర్షి
వెనుక చిత్రం : శ్రీవేంకటేశ్వరస్వామి

హిందూ దేవుళ్లు

# చక్రత్తాళ్వార్

- ఆచార్య కె. సర్వోత్తమరావు

శ్రీమహావిష్ణువుకు ఆయుధాలు ఐదు. అవి- శంఖం, చక్రం, గద, ఖడ్గం, విల్లు. వాటిపేర్లు - శంఖానికి పాంచజన్యమని పేరు. గదకు కామోదకి అని పేరు, ఖడ్గానికి నందకమని పేరు. వింటికేమో శార్ఙ్గమనే పేరు.

విష్ణువు ఐదుఆయుధాలలో చక్రానికే ప్రసిద్ధి. ఈ చక్రాన్ని సుదర్శనచక్రమంటారు. వైష్ణవాలయాలలో 'చక్రత్తాళ్వార్' పేరుతో పూజలు, పునస్కారాలు. కొన్నిఆలయాలలో ప్రత్యేకసన్నిధులుంటాయి.

స్వామి ఆ చక్రాయుధప్రయోగంతోనే లోకకంటకుల్ని సంహరించాడు. ఆపదల్లో ఉన్నవారిని కాపాడాడు. పైగా స్వామికి జరిగే ఉత్సవాలలో తానే ముందుండి స్వామికి రక్షగా ఉంటాడు. శ్రీకృష్ణుని ఎప్పుడూ ఆడిపోసుకొనే శిశుపాలుని నూరుతప్పులు సహించి, స్వామి చివరకు చక్రాయుధంతోనే ఆ శిశుపాలుణ్ణి సంహరించాడు. ఒక్క శిశుపాలుణ్ణిమాత్రమే కాదు. స్వామి చక్రాయుధంతో ఎన్నోసార్లు దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేశాడు.

ఉదాహరణకు గజేంద్రమోక్షణకథను చెప్పుకోవచ్చు. గజేంద్రుడంటే ఏనుగులరాజు. ఒక అడవి. ఆ అడవిలో గజేంద్రుడు బలవంతుడు. ఆ ఏనుగుకు పరివారంకూడా ఎక్కువే! ఒక మండువేసవిలో గజేంద్రం జలక్రీడలాడాలనుకొంది. ఇంకేం? పరివారమంతా కదిలారు.

ఆ ఏనుగులన్నీ ఒక పెద్దసరోవరందగ్గర ఆగాయి. ఆ సరోవరంలో అన్నీ దిగాయి. ఘీంకారాలతో, తొండాలతో నీళ్ళు చల్లుకొంటూ చాలసేపు సరోవరంలోనే ఉండిపోయాయి. సరోవరమంతా అల్లకల్లోలమైంది. అపుడు ఒక మొసలి-ఏనుగుల ఆగడాల్ని చూచి, తానేమిటో, తన బలమేమిటో ఏనుగుల ముందు సత్తా చాటించాలనుకొంది. అదను చూచి

గజేంద్రం కాళ్ళు పట్టేసింది. ఏనుగు కదలలేకపోయింది. కాళ్ళు వెనక్కు లాక్కోలేకపోయింది.

'నీటిలోని మొసలి నిగిడి యేనుగుబట్టు - బయట కుక్కచేత భంగపడును. స్థానబలిమి కాని తనబల్మి కాదయా!' అన్నట్లు నీటిలో మొసలిబలం ఎక్కువ. ఆ బలంముందు ఇతరజంతువుల బలాలు బలాదూర్. చాలకాలం గజేంద్రం పోరాడింది. పరివారం ఏమి చేయలేక పోయింది. చివరకు విష్ణువే రక్షకుడని 'ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు.... ఈశ్వరునే శరణంబు వేడెదన్' అంటూ ప్రార్థించింది.




భగవంతుడు కరుణాసముద్రుడు. భక్తులను ఎవరయినా ఏడిపిస్తే చూస్తూ ఊరుకోడు. అంచేత ఆ గజేంద్రుడిమొఱవిని, వెంటనే సరోవరం దగ్గరికి వచ్చాడు. గజేంద్రునిబాధ చూచాడు. మొసలిపట్టు చూచాడు. వెంటనే చక్రాయుధం ప్రయోగించాడు. ఆ చక్రం గిరగిర తిరుగుతూ మొసలిమెడను తాకింది. మెడ, తల వేరుచేసింది. ఏనుగు పరమా నందంతో 'పరంధామా! ఆర్తత్రాణపరాయణా! భక్తవత్సలా! అంటూ స్తుతించింది.

పన్నిద్దరాళ్వార్లు

# నమ్మాళ్వారు

- శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు

ఆళ్వార్లు పన్నెండుమంది. ఆళ్వారులు అంటే జ్ఞానం అనే సముద్రంలో మునిగి లేచినవారు అని అర్థం. పన్నెండుగురు ఆళ్వార్లలో నమ్మాళ్వారు ఒకరు.

నమ్మాళ్వారు తమిళనాడు, పాండ్యమండలంలోని తామ్రపర్ణీనదీ తీరంలో ఉన్న ఆళ్వార్ తిరునగరిలో జన్మించారు. ఆళ్వార్‌తిరునగరి నూటఎనిమిది దివ్యతిరుపతులలో ఒకటి.


ఆళ్వార్ తిరునగరిలో ఆదినాథప్పెరుమాళ్ స్వామివారు వెలశారు. ఆ స్వామివారి కృపవల్ల నమ్మాళ్వారు పుట్టారు. శ్రీమహావిష్ణువుసన్నిధిలో సర్వసైన్యాధ్యక్షులుగా ఉండే విష్వక్సేనులవారిఅంశతో నమ్మాళ్వారు జన్మించారు. నమ్మాళ్వారుతండ్రిపేరు 'కారి'. తల్లిపేరు ఉడయనంగయార్/ నాథనాయిక.

నమ్మాళ్వారుకు చాలాపేర్లు ఉన్నాయి. వాటిలో కరిమారులు, కారిసూనులు, మారన్‌శఠకోపులు, పరాంకుశులు, కురుకేశ, కురుకాధిప, కురక్కెప్పిరాన్, తిరుక్కురుంగుడినంబి, ఆరుళ్‌మారన్, వకుళాభరణులు అనేవి ప్రధానమైనవి.

నమ్మాళ్వారును రక్షించడానికి ఆదిశేషుడు ముందుచూపుతో తిరునగరిలో చింతచెట్టురూపంలో ఉంటాడు.

నమ్మాళ్వారులు పుట్టినప్పుడు, ఏడువలేదు, కన్నులు తెరువలేదు, చనుబాలు తాగలేదు, కేవలం పడుకొని ఉన్నారు. అయినాకూడా పరాంకుశులవారిముఖం వాడిపోక, చిక్కిపోక, ప్రకాశవంతంగా ఉండింది. ఇలా పద్దెనిమిదిరోజులు గడచాయి. నమ్మాళ్వారు తల్లిదండ్రులు అలాంటి తమశిశువును ఆదినాథపెరుమాళ్ ఆజ్ఞతో ఒక చింతచెట్టుదగ్గర పడుకోబెట్టి, పుత్రప్రేమను వదలుకొని వెళ్లిపోతారు. ఏడాదికాలం గడుస్తుంది.

అప్పుడు కారి, నాథ నాయికలు తమ బాలుణ్ణి చూడడానికి అక్కడకు వస్తారు. అప్పుడు అక్కడ ఆడుకుంటున్న బాల నమ్మాళ్వారు తల్లిదండ్రులకు కనపడకుండ చింత చెట్టుతొర్రలోకి వెళ్లి పోతారు. ఇలా పద్మాలు గేండ్లు గడుస్తాయి.



మధురకవి అనే వారు దేశసంచారం చేస్తూ, పాండ్యనాడులోని తిరునగరికి వస్తారు. అక్కడ నమ్మాళ్వారును మేల్కొల్పడానికి చప్పట్లు కొడతాడు.

నమ్మాళ్వారు కనులు తెరచి మధురకవిని చూస్తారు. మధురకవి చాలా సంతోషిస్తారు. మధురకవికి కలిగిన అనేకసందేహాలను నమ్మాళ్వారు తీరుస్తారు. మధురకవికి నమ్మాళ్వారు పంచసంస్కారాలు చేస్తారు.

ఒక పర్యాయం శ్రీలక్ష్మీనారాయణులు గరుడారూఢూలై నమ్మాళ్వారుకు సాక్షాత్కరిస్తారు. నమ్మాళ్వారు భగవంతుని దర్శనంతో దివ్యమైన అనుభూతిని పొంది, నాలుగుదివ్యప్రబంధాలను అనుగ్రహిస్తారు. అవి- 1)తిరువిరుత్తం 2) శిరువాచ్చిరియం 3)పెరియతిరువందాది 4)తిరువాయ్‌మొళి.

నమ్మాళ్వారు అనుగ్రహించిన ఈ దివ్యప్రబంధాలలో ముప్పై ఎనిమిదిదివ్యతిరుపతుల మంగళాశాసనం ఉంది. వాటిలో తిరుమల కూడా ఉంది.

కన్నడ హరిదాస వరేణ్యులు

# శ్రీరాఘవేంద్రస్వామి

- శ్రీ దేసువెంకటసుబ్బారావు

శ్రీరాఘవేంద్రస్వామి తమిళనాడులోని భువనగిరి (నేటి చిదంబరం వద్ద)లో తిమ్మన్నభట్టు, గోపికాంబ దంపతులకు గురువారం, శుక్ల నవమి, ఫాల్గున మాసం, మృగశీర్షా నక్షత్రంలో జన్మించారు. శ్రీవేంకటేశ్వరుని దయవల్ల పుట్టారు కనుక వీరికి వేంకటనాథుడు అని పేరు పెట్టారు. చిన్నతనంనుండి దైవభక్తి కలవారు. అక్షరాభ్యాససమయంలో "ఓం" అక్షరాన్ని చూచి, ఇంత చిన్నఅక్షరం దేవునిగొప్పతనంగురించి ఏమి చెబుతుంది? అని ప్రశ్నించారట. వీరిచిన్నతనంలోనే తండ్రి మరణించడంతో వీరిబాల్యవిద్య వీరిఅన్నగారైన గురురాజాచార్యులవద్ద జరిగింది. తదుపరివిద్య వీరి బావగారైన శ్రీలక్ష్మీనరసింహాచార్యులవారి సహాయంతో మధురైలో కొనసాగింది.

వేంకటనాథుడు మధురైలో యజుర్వేదాన్ని, మణిమంజరిని, హనుమద్ విజయాన్ని అభ్యసించారు. ఒకనాడు సంధ్యావందనం చేస్తూ జారవిడచిన నీరు ఎండినవిత్తనం మీదపడి చిగురించింది. దీనితో వీరి మహిమ ప్రపంచానికి తెలిసింది. తరతరాలనుండి వీరిది సంగీతకళాకారుల వంశంకావడంతో వీరికికూడా సంగీతం అబ్బింది. వీరు గొప్ప వీణానాదవిద్వాంసులు. అందువల్ల వీరిని వీణావెంకటభట్టు అనికూడ పిలిచేవారు. వేంకటనాథునిభార్య సరస్వతి. వీరికి లక్ష్మీనారాయణుడనే కుమారుడు కలిగాడు.

వివాహానంతరం వేంకటనాథుడు కుంభకోణం వెళ్లి, అక్కడ శ్రీసుధీంద్రతీర్థులవారివద్ద విద్యాభ్యాసం కొనసాగించారు. ఆ సమయంలోనే ఒక పండితుడితో మాయావాదంపైన రాజమన్నార్ ఆలయంలో పోటీ జరిగింది. అందులో వేంకటనాథుడు తనవాక్పటిమతో మాయావాదపండితుణ్ణి సునాయాసంగా ఓడించారు. అది చూచి, శ్రీసుధీంద్ర

తీర్థులు ఆశ్చర్యపోయి, వీరికి “మహాభాష్యవేంకటనాథాచార్య” అనే బిరుదునిచ్చి గౌరవించారు. వేంకటనాథుని అసాధారణప్రజ్ఞను గుర్తించిన సుధీంద్రుడు వీరిని సన్యాసంతీసుకుని, ఆశ్రమబాధ్యతలు నిర్వహించమని కోరారు. అయితే, వేంకటనాథుడు అటు సంసారబాధ్యతలు, ఇటు మధ్వాచార్యుల ద్వైతసిద్ధాంతం రెంటినీ సమన్వయం చేయడమెలాగని సందేహించారు.



అప్పుడు విద్యాలక్ష్మి ప్రత్యక్షమై ఆశ్రమనిర్వహణకు నీవే సమర్థుడవని చెప్పింది. దాంతో వేంకటనాథుడు, రాఘవేంద్రతీర్థులు అనే పేరుతో సన్యాసదీక్షను స్వీకరించి, మఠం బాధ్యతలు తీసుకున్నారు. అప్పటినుండి రాఘవేంద్రతీర్థులు తన శిష్యులకు అనేకవిషయాలను బోధిస్తూ, అనేక విషయాలపై పలుగ్రంథాలను రచించారు.


శ్రీరాఘవేంద్రులు అనేకపుణ్యక్షేత్రాలను దర్శించారు. రామేశ్వరం, మధురై దర్శించినప్పుడు, అక్కడ మాయావాదంలో మహాపండితుడైన నీలకంఠదీక్షితులతో తలపడ్డారు. నీలకంఠదీక్షితులు శ్రీరాఘవేంద్రునిప్రజ్ఞాపాటవాలకు పరవశించి, వారిని పూర్ణప్రజ్ఞులుగా అభివర్ణించారు. శ్రీరాఘవేంద్రుణ్ణి గజారోహణ గావించి సత్కరించారు. తర్వాత రాఘవేంద్రుడు శ్రీరంగం చేరుకున్నారు. అక్కడ పండితులతో ఉపనిషత్తులమీద, ఈశావ్యాసోపనిషత్తుపైన చర్చాగోష్ఠి నిర్వహించారు. శిష్యుల అభ్యర్థనమేరకు అన్నిమంత్రాలకు విశ్లేషణతో కూడిన వ్యాఖ్యానాలు రచించారు. వీటితో పాటు ముండక, మాండూక్య, తైత్తిరీయ, బృహదారణ్యక, ఛాందోగ్యోపనిషత్తులకు కూడ సమీక్షలు రచించారు.

చిత్ర కథ


# శ్రీవారికే మామగారు

కథ – డి. శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు – పేరూరు శివప్రసాద్

శ్రీవేంకటాచలం మీద స్వామివారి పుష్పకైంకర్యం కోసం అనంతాళ్వారు నందనవనాన్ని అపురూపంగా పెంచుతున్నాడు. అక్కడ పూసిన పూలతో అందంగా మాలల్ని కట్టి స్వామికి సమర్పించడం ఆయన నిత్యకృత్యం. ఒక రోజు......





మర్నాడు రాత్రి దొంగల్ని పట్టుకునేందుకు ఆళ్వారు ఒక మూల నక్కి కూర్చున్నాడు . అప్పుడు నవదంపతులు విలాసంగాతోటలోకి వచ్చారు.




వాళ్ళిద్దరూ ఉల్లాసంగా తోటలో పూలు కోస్తూ వాసన చూస్తూ తిరుగుతున్నారు.




ఆ జంటని చూడగానే ఆళ్వారు కి బాగా కోప మొచ్చింది
ఈ తుంటరి వాళ్ళకి తగిన బుద్ధి చెప్పాలి
ఏయ్ ఎవరు మీరు? తోటంతా పాడుచేస్తున్నారేంటి
అలాగే స్వామీ
లక్ష్మీ! అడుగో తోటమాలి ఇటే వస్తున్నాడు పట్టుకుంటాడు పరిగెత్తు...పరిగెత్తు...
పరిగెత్తుతున్న ఆ జంటని వెంటబడి ఆళ్వారు పట్టుకున్నాడు. కానీ స్వామి తప్పించుకున్నాడు. లక్ష్మి మాత్రం ఆయనకు పట్టుబడింది.
నన్ను నీ కూతురుగా అనుకో దయతో విడిచిపెట్టు . ఇంకెప్పడూ ఇక్కడకు రాను!
ష్.....మాట్లాడకు. నా ఉత్తరీయంతో ఈ సంపెంగచెట్టుకు నిన్ను కట్టేస్తున్నాను. మీ ఆయన వచ్చి విడిపిస్తాడులే!


నా స్వామికి మాలగా కట్టాల్సిన పూలను నువ్వు కొప్పులో పెట్టుకుని కులుకుతున్నావా? నీకు సిగ్గు లేదూ.
తండ్రీ! ఇంకెప్పుడూ ఇలా చెయ్యను ఈ తోటవైపుకి రాను. నన్ను విడిచి పెట్టు...
సంపెంగచెట్టుకి మహాలక్ష్మి ని తన ఉత్తరీయంతో కట్టేసి ఆమెకి ఎదురుగా కూర్చుని కునికిపాట్లు పడుతూ కాపలా కాస్తున్నాడు ఆళ్వారు.
లక్ష్మి .... ఈయన నన్ను విడిచిపెట్టే టట్టు లేదు!
సుప్రభాతసేవకోసం ఆలయానికి వచ్చిన అర్చకులకి శ్రీవారి హృదయం మీద మహాలక్ష్మి కనిపించలేదు. వాళ్లు కలత చెందారు. అనంతాళ్వారు తోట దగ్గర సంపెంగచెట్టుకి లక్ష్మి బంధింపబడి ఉంది. మీరు మేళతాళాలతో వెళ్ళి ఆమెను తీసుకురండి అని స్వామి ఆదేశించారు. అర్చకులు వెళ్ళి ఆళ్వారుకి విషయమంతా చెప్పారు.అప్పుడు ఆళ్వారు
అమ్మా! నన్ను మన్నించు. నిన్ను బంధించి మహాపరాధం చేసాను. అనుగ్రహించు!
పెద్ద పూల గంపలో పెళ్ళికూతురిలా అలంకరించిన అమ్మవారిని కూర్చోబెట్టి ఆ గంపని తలమీద పెట్టుకుని ఆలయానికి వెళ్లాడు ఆళ్వారు.
స్వామీ! నన్ను కరుణించి మహాలక్ష్మిని స్వీకరించు




వచ్చే సంచికలో...

**శ్రీవేంకటేశ్వరుని మరో దివ్యలీలావిలాసాన్ని దర్శించి...తరిద్దాం!**

**స్వస్తి !**




# ఈర్ష్య మంచిది కాదు!!

- ఆచార్య పి.ఎల్.శ్రీనివాసరెడ్డి

కం. పరుల ధనమునకు విద్యా
పరిణతికిన్ తేజమునకు బలమునకు మనం
బెరియగ నసహ్యపడు న
న్నరుడు తెవులు లేని వేదనన్ పడునధిపా! ॥

ఇతరుల ధనానికి, ఇతరుల పాండిత్యానికి, ఇతరుల తేజస్సుకు, ఇతరుల బలానికి మనసు కాలిపోయే విధంగా అసహ్యపడేవాడు రోగం లేని బాధను అనుభవిస్తాడు.

రోగం ఉంటే బాధపడడం సహజం. ఒకడు బయటికి బాగానే కనిపిస్తున్నాడు. కానీ వేదన పడుతున్నాడు. వాడికేం రోగముందోనని రోగనిర్ధారణకేంద్రానికి (**Diagnostic Centre** కు) తీసుకువెళ్ళి, అన్ని విధాలపరీక్షలు చేయించినా ఫలితం శూన్యం. అతనికి ఏ రోగమూ లేదనీ, సర్వాంగాలూ సుందరంగా ఉన్నాయని వైద్యనిపుణులు నిర్ధారించారు.

అయితే, అతనెందుకు బాధపడుతున్నట్లు? వేదనపడడానికి రోగం ఉండడం ఒక్కటే కారణం కానక్కర లేదు. తనకు లేనిది ఎదుటి వాళ్ళకు ఉన్నా, తనకున్న దానికన్నా ఇతరులకు ఏ కొంచెం ఎక్కువగా ఉన్నా చాలు- అదే వేదనకు మూలమవుతుంది.

రోగం లేకపోయినా అలా తీవ్రవేదనను కలిగించే విషయాలు ప్రధానంగా నాలుగు ఉన్నాయి. ఒకటి ధనం, రెండు పాండిత్యం, మూడు

తేజస్సు అంటే సమాజంలో దేదీప్యమానంగా వెలిగిపోవడం, నాలుగు బలం అంటే కండబలం, గుండె బలం, బంధుబలగం ఏదైనా కావచ్చు.

తనకు లేనందువల్ల ఏడ్చేవాడిని మనం అర్థం చేసుకోవచ్చు. కానీ ఈ ఏడ్పు అలాంటిది కాదు. తనకు లేకపోవడంకన్న ఎదుటి వాడికి ఉండడంవల్ల కలిగే రోదన. దీనికి అంతం ఉండదు. ఇది అనంతం.

కొందరికి ఏడుపనేది నిత్యకృత్యం. అది లేకపోతే తోచదు. ఏడ్వడానికి ఏదో కారణం ఉండాలి. ఉండకపోతే సృష్టించుకుంటారు. అలా ఎంతోవిలువైన జీవితకాలాన్ని వృథా చేసుకుంటారు. ఎదుటి వానికున్న దాన్నిగురించి కాకుండా తనకు కావలసినదాన్ని తాను నిరంతరశ్రమతో సాధించుకోవాలి తప్ప- ఏడుస్తూ కూర్చున్నందువల్ల ఏమీ ప్రయోజనం ఉండదు.

పద్యంలోని రెండువిశేషాల్ని పరిశీలిద్దాం. ఇతరులకేవో ఉన్నా యనీ, అవి తనకు లేవనీ అలవోకగా అసహ్యపడడం కాదు. 'మనసు కాలి పోయేవిధంగా' అనడంవల్ల అసహ్యపడడం పరాకాష్ఠనందు కొంది.

ఇంకో విశేషం. ఆకాశమంత విశాలంగా, అందంగా ఉండ వలసిన నరుడు కుంచించుకుపోయి, కురూపిగా రూపాంతరం చెందడాన్ని మనకళ్ళకు కట్టించడానికి త్రికసంధి సాధనమైంది. ఆ నరుడు అన్నరు దయ్యాడు.

తిక్కన మహాకవి చెప్పిన ఈ గొప్పభావనకు ముగ్ధుడై ఆధునిక మహాకవి గురజాడ అప్పారావు ఆ భావాన్ని ముత్యాలసరంలోకి తీసుకు వచ్చి మురిసిపోయాడు.

'పరుల కలిమికి పొర్లియేడ్చే.
పాపి కెక్కడ సుఖం కలదోయ్' అని

# విశిష్టబాలిక



**పేరు** - ఎ.అనఘ

**తరగతి** - 9వ తరగతి

**పుట్టిన తేది** - 11-05-2007

**తండ్రిపేరు** - వి.అరుణ్‌కుమార్

**తల్లిపేరు** - శ్రీమతి వి.సుధ

**పాఠశాల** - మహిళాలయం, ఆలువ, కేరళ

**విశేషప్రతిభ- వివిధరంగాలు -**

క్లాసికల్ మ్యూజిక్, వయోలిన్ & క్లాసికల్ డాన్స్.

అనఘ మూడేళ్లప్రాయంలోనే శాస్త్రీయసంగీతాన్ని అభ్యసించి, తన గురువుగారైన శ్రీమతి శ్యామాహరిదాస్ నేతృత్వంలో వేదికలమీద ప్రదర్శన ఇవ్వడం ప్రారంభించింది. పాఠశాలస్థాయిలో స్కూలుతరఫున ఎన్నో యువ జనోత్సవాలలో పాల్గొని, ప్రథమబహుమతులు పొందింది. ఈ విద్యార్థిని శ్రీమతి గీతాపరమేశ్వరన్ దగ్గర వయోలిన్‌లోకూడా సుశిక్షితురాలయ్యింది.

ఈ చిన్నారిప్రతిభ కేవలం సంగీతంలోనే ఆగిపోలేదు. కాలడీలోని శ్రీశంకరనృత్యపాఠశాలలో శ్రీమతి సుధాపీతాంబరంవద్ద భరతనాట్యం, మోహినీయాట్టం నేర్చుకుంది. నాలుగుశ్రేణులలో సర్టిఫికేట్‌కూడా పొందింది.

ఈ చిన్నారిమొదటి నృత్యప్రదర్శన 2017 సంవత్సరంలో కాలడిలో జరిగిన అంతర్జాతీయనృత్యోత్సవంలో జరిగింది. అప్పటినుండి అనఘ అనేక వేదికలమీద ప్రదర్శనలిస్తూనే ఉంది.

2018 సంవత్సరంలో చొట్టంకర భగవతి ఆలయంలోను, కొల్లూరు మూకాంబికాఆలయం, నవరాత్రిఉత్సవాల్లోనూ, గురువాయ్యూర్ శ్రీకృష్ణ ఆలయంలోనూ, కాలడి శ్రీకృష్ణఆలయంలోనూ మరియు పల్లిపట్టుకొదేవి ఆలయంలోనూ ప్రదర్శన ఇచ్చి, అనేకప్రశంసలు పొందింది.

# క్విజ్

**నిర్వహణ- డా॥ కంపల్లె రవిచంద్రన్**

**1) శ్రీమహావిష్ణువు నరసింహావతారం ఏ యుగంలో ధరించాడు?**

అ) కృతయుగం ఆ) త్రేతాయుగం

ఇ) ద్వాపరయుగం ఈ) కలియుగం

**2) శ్రీమహావిష్ణువు శ్రీరాముడిగా ఏ యుగంలో అవతరించాడు?**

అ) కృతయుగం ఆ) త్రేతాయుగం

ఇ) ద్వాపరయుగం ఈ) కలియుగం

**3) శ్రీమహావిష్ణువు శ్రీకృష్ణుడిగా ఏ యుగంలో అవతరించాడు?**

అ) కృతయుగం ఆ) త్రేతాయుగం

ఇ) ద్వాపరయుగం ఈ) కలియుగం

**4) శ్రీమహావిష్ణువు శ్రీవేంకటేశ్వరుడుగా అవతరించిన యుగం?**

అ) కృతయుగం ఆ) త్రేతాయుగం

ఇ) ద్వాపరయుగం ఈ) కలియుగం

**5) ఆదిశేషుడు లక్ష్మణుడిగా అవతరించిన యుగం?**

అ) కృతయుగం ఆ) త్రేతాయుగం

ఇ) ద్వాపరయుగం ఈ) కలియుగం

**6) యశోద వకుళమాతగా జన్మించిన యుగం?**

అ) కృతయుగం ఆ) త్రేతాయుగం

ఇ) ద్వాపరయుగం ఈ) కలియుగం

**7) శ్రీమహాలక్ష్మి సీతగా అవతరించినయుగం?**

అ) కృతయుగం ఆ) త్రేతాయుగం

ఇ) ద్వాపరయుగం ఈ) కలియుగం

---

జవాబులు

1) అ 2) ఆ 3) ఇ 4) ఈ 5) ఆ 6) ఈ 7) ఆ

# చిత్ర లేఖనం

ఈ బొమ్మకు
రంగులు వేద్దామా...



పై బొమ్మను క్రింది గళ్ళలో గీయండి...





శ్రీవారి మెట్లోత్సవంలో బాలబాలికలు

SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams
printing on 30-07-2020. Regd. with the Registrar of Newspapers under
"RNI" No.10742, Postal Regd.No.TRP/10 - 2018-2020
Licensed to post without prepayment No.PMGK/RNP/WPP-04/2018-2020



నిత్యాయ నిరవద్యాయ సత్యానంద చిదాత్మనే ।
సర్వాంతరాత్మనే శ్రీమద్వేంకటేశాయ మంగళం ॥